# సమన్వయంతో విధులు నిర్వహించాలి

- కేంద్ర ఎన్నికల కమిషన్ పరిశీలకులు స్వచ్ఛేంద్ర ప్రతాప్‌సింగ్
- ఏవీ కళాశాలలో అభ్యర్థులకు ఈవీఎంల ర్యాండమైజేషన్ పీవో, ఏపీవోలకు ఎన్నికల విధులపై శిక్షణ శిబిరం

**కవాడిగూడ:** బూత్‌స్థాయి అధికారుల నుంచి, రిటర్నింగ్ అధికారి వరకు సమన్వయంతో పని చేస్తూ ఎన్నికల విధులు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల కమిషన్ పరిశీలకులు స్వచ్ఛేంద్ర ప్రతాప్‌సింగ్ అన్నారు. శనివారం ముషీరాబాద్ నియోజకవర్గం దోమలగూడలోని ఏవీ కళాశాలలో పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, ముషీరాబాద్ నియోజకవర్గ అభ్యర్థులకు ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించేందుకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి స్వచ్ఛేంద్ర ప్రతాప్‌సింగ్, ముషీరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. లక్ష్మినారాయణ, ముషీరాబాద్ నియోజకవర్గ పరిశీలకులు తిప్పర్తి యాదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వచ్ఛేంద్ర ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.... పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమయ్యేలా అధికారులు సిద్ధంగా ఉండాలని, సాయంత్రం 5 గంటల తర్వాత ఎవరిని పోలింగ్ బూత్‌లోకి అనుమతించవద్దని సూచించారు.

**పెరిగిన పోలింగ్ బూత్‌లు**

ముషీరాబాద్ నియోజకవర్గంలో కొత్తగా నమోదైన ఓటర్లతో 15 నూతన పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.లక్ష్మినారాయణ తెలిపారు. గతంలో 274 పోలింగ్ బూత్‌లు ఉండగా ప్రస్తుతం 289 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వాహణ కోసం 289 మంది బీఎల్‌వో (బూత్‌లెవల్ అధికారులు) 26మంది రూట్ ఆఫీసర్లు, 26మంది సెక్టార్ అధికారులతో పాటు 10 మంది ఇంజినీరింగ్ విభాగం అధికారులను నియమించినట్లు తెలిపారు.

**20, 24, 29 తేదీల్లో ఎన్నికల ఖర్చుల తనిఖీ**

ముషీరాబాద్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల సందర్భంగా ప్రచారం, ఇతర అవసరాలకోసం ఉపయోగించిన ఖర్చుల వివరాలను పోలింగ్ తేదీ కంటే ముందుగా మూడు పర్యాయాలు తనిఖీలు చేయించుకోవాలని ముషీరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. లక్ష్మినారాయణ అభ్యర్థులకు సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుల ఆధ్వర్యంలో 20, 24, 29 తేదీలలో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఖర్చుల వివరాలను వ్యక్తిగతంగా లేదా ధృవీకరించిన ఎన్నికల ఏజెంటుతో అధికారులకు అందజేయాలని అభ్యర్థులకు సూచించారు.



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు స్వచ్ఛేంద్ర ప్రసాద్‌సింగ్

## దేవిరెడ్డి విజితారెడ్డి కాంగ్రెస్‌లో చేరిక



దేవిరెడ్డి విజితారెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

**కాచిగూడ:** బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా సీనియర్ నాయకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి శనివారం అంబర్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజితారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం అవినీతి కుంభకోణాల్లో మునిగిపోయిందని, వచ్చేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అంబర్‌పేటలో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం



నల్లకుంటలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్ రెడ్డి

- అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్ రెడ్డి

**నల్లకుంట:** బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడిందని అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సి. రోహిణ్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన నల్లకుంట డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో అంబర్‌పేట నియోజక వర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. హస్తం గుర్తుపై ఓటేసి తనను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని చెప్పారు. మాజీ కార్పొరేటర్లు గరిగంటి శ్రీదేవి రమేష్, పులి జగన్, గ్రేటర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కె. గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, చింతల ధనార్జున్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిక

**చిక్కడపల్లి:** తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ (టీయూసీపీఏ) సంస్థకు చెందిన 33 జిల్లాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం టీపీసీసీ ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావు ఠాక్రే సమక్షంలో సంస్థ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గోనె సాల్మన్‌రాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం క్రిష్టియన్ల కనీస అవసరాలు కూడా తీర్చలేని స్థితికి చేరుకుందన్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో తమ సంస్థ తరపున బీఆర్ఎస్ కు పూర్తి సహకారం అందించామన్నారు. పాస్టర్లకు నెలకు రూ.10వేల రెమ్యూనరేషన్, షాదీముబారక్ కింద రూ.1.5 లక్ష, విద్యార్థులకు రూ.10వేల నుంచి రూ. లక్ష సాయం, స్మశాన వాటికల ఏర్పాటుకు కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. అందుకే అత్యధికంగా క్రైస్తవ జనాభా ఉన్న దాదాపు 28 అసెంబ్లీ నియోజవర్గాల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు నిర్ణయించామన్నారు. అధ్యక్షులు బిషప్ కె.తిమోతి, ఉపాధ్యక్షులు పి.మెన్నోజోయెల్, కోశాధికారి ఎం.పురుషోత్తం, జయకుమార్ జాక్యూస్, బెనోని రిచర్డ్, ప్రమోద్ విల్సన్, ఆర్.కిషోర్, జయపాల్, హేమలత, శాలిని, రేకల భద్రాది, జి.సుకుమార్ ఆజోన్, విశాల్ పాల్గొన్నారు.

### పుస్తకం ఒక ఆయుధం



**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ప్రపంచాన్ని జయించేందుకు పుస్తకమే ఒక ఆయుధమని హైదరాబాద్ డీఈవో రోహిణి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకు శనివారం నవ తెలంగాణ బుక్ హౌస్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శనలో ప్రముఖులు జీవిత చరిత్రలు, సైంటిఫిక్‌కు సంబంధించిన అంశాలు, కథలు, నిఘంటువులు అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ జనరల్ మేనేజర్ వాసు, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, బొజ్జ భిక్షమయ్య, ధనలక్ష్మి, సుభాషిణి, సిద్ధు, అస్మా బేగం, సత్యవతి పాల్గొన్నారు.

## ప్రజలు చైతన్యవంతులు కావాలి

**కాచిగూడ:** ఓటు అనే ఆయుధాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో సద్వినియోగం చేసుకుని సరైన వ్యక్తులను ఎన్నుకోవాలని దక్షిణ భారత న్యాయవాదుల జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ అన్నారు. దక్షిణ భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పురలో 'ఓటు – రాజ్యాంగం' పై చర్చ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్యారంటీల పేరుతో వివిధ పార్టీలు గుప్పిస్తున్న ప్రకటనలకు మోసపోకుండా సరైన అభ్యర్థిని ఎన్నుకోని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఓటు విలువ తెలియక ప్రజలు కొందరు రాజకీయ నేతల అసత్య ప్రచారాలను నమ్మి మోసపోతున్నారన్నారు. వీరి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డబ్బులకు ఓటును అమ్ముకోవద్దని ఆయన కోరారు. సమావేశంలో న్యాయవాదులు షాబుద్దీన్, డాక్టర్ ఇస్మాయిల్, తెలంగాణ రాష్ట్ర మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, ప్రవలిక, ఎం.రాజ్ కుమార్, సతీష్ గౌడ్, రామచంద్రారెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



నుక్కడ్ నాటక్ ప్రదర్శనలో పాల్గొన్న కాచిగూడ బద్రుక కళాశాల విద్యార్థులు

**కాచిగూడ:** ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బద్రుక కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్ కుమార్ అన్నారు. కాచిగూడ లోని బద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ దియేట్రిక్స్ క్లబ్ ఇన్‌చార్జి సంధ్య ఆధ్వర్యంలో శనివారం రైట్ టు ఓట్ అంశంపై నుక్కడ్ నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు వేసి మంచి అభ్యర్థిని ఎన్నుకున్నప్పుడే మంచి పరిపాలన అందుతుందన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. భయపడటం ఎప్పుడు మానేస్తామో అప్పుడు మన జీవితం మొదలైనట్లు, అందుకే భయపడకుండా ఓటేయాలన్నారు. పోరాడి రాజు అవుతారో ఓటు అమ్ముకుని బానిసలవుతారో నిర్ణయం మీ చేతుల్లో ఉందన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి నవీన్ పర్యవేక్షణలో విద్యార్థులు ఈ నాటకాన్ని ప్రదర్శించి ప్రజలను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటయ్య, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ మానిష్, శృతి, దుర్గా పరిమల్, ఉమా, నిఖిత, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మోచీ కుల సంఘం ప్రతినిధులు



కిరాణ షాప్ ఓనర్‌కు కరపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్

- అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్
- నియోజకవర్గ పరిధిలో విస్తృత ప్రచారం

**నల్లకుంట:** నియోజక వర్గంలో తాను చేసిన అభివృద్ధి, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం ఆయన నల్లకుంట డివిజన్ పరిధిలోని స్ట్రీట్ నంబర్ 13,14, శంకరమఠం కూరగాయల మార్కెట్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ లేన్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ఓటర్లకు అందజేసి, కారు గుర్తుపై ఓటేసి తనను మరో సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు ఎం.భూపతినాథ్, గాలపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**కాలేరుకు మద్దతుగా మోచీ కులసంఘం ప్రచారం**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్‌కు మద్దతుగా మోచీ కుల సంఘం ప్రతినిధులు శనివారం నల్లకుంట, అంబర్‌పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోచీ కుల బంధువులను కలిసిన సంఘం ప్రతినిధులు కారు గుర్తుపై ఓటేసి కాలేరును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అంబర్‌పేట నియోజక వర్గం ప్రధాన కార్యదర్శి పింజరి నర్సింగ్ రావు, కోశాధికారి కైలాష్, వైస్ చైర్మన్ ప్రభురాజ్, ఏ. శివ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం..కోటి దీపోత్సవం





**కవాడిగూడ:** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం ఐదవ రోజు శనివారం అత్యంత వైభవంగా కొనసాగింది. శ్రీ వామనాస్త్రం స్వామీజీ (హల్దీపురం మఠం కర్ణాటక) శ్రీ రితేశ్వర్ స్వామీజీ ( ఆనందదాం, బృందావనం) అనుగ్రహ భాషణం చేయగా ప్రముఖ నయనార్‌ల చరిత్రకారిని అరుణచల మాధవి ప్రవచానామృతం వినిపించారు. భక్తులు నృసింహ విగ్రహాలకు రక్షా కంకణ పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారిని భక్తుల సందర్శనార్థం శేషవాహనంపై కోటిదీపోత్సవ ప్రాంగణంలో ఊరేగించారు.

## బీఆర్ఎస్‌కు దివిటి రజినీకాంత్ రాజీనామా



దివిటి రజనీకాంత్

**అంబర్‌పేట:** అంబర్‌పేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దివిటి రజనీకాంత్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. శనివారం బాగ్ అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...2015 నుంచి బీఆర్ఎస్ పటిష్టత కోసం కీలకంగా పనిచేస్తే తగిన గుర్తింపు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు జీహెచ్ఎంసీ ఎన్నికలు, ఒక అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పనిచేసి పార్టీ అభ్యరుల గెలుపునకు కృషి చేశానన్నారు. రాష్ట్ర ప్రదేశ్ గంగపుత్ర సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ పటిష్టతకు పని చేశానన్నారు. గత 8 ఏళ్లుగా పార్టీలో అంకితభావంతో పనిచేస్తే తగిన ప్రాధాన్యం, గుర్తింపు దక్కకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఏ పార్టీలో చేరబోయేది తన సన్నిహితులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలకు విశేష స్పందన

- ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్ కుమార్ యాదవ్
- పలు ప్రాంతాల్లో పాదయాత్ర
- ఆరు గ్యారెంటీలపై అవగాహన

**ముషీరాబాద్:** కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలకు విశేష స్పందన లభిస్తోందని కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన చేపల మార్కెట్, మోహన్‌నగర్, బోయబస్తీ, ఫ్రెండ్స్ కాలనీ, జాంభవినగర్, ప్రేయర్ పవర్ చర్చ్, 44 బస్టాప్, గంగపుత్ర కాలనీ తదితర ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి బస్తీలో మహిళలు మంగళహారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. మహిళా లోకం అంతా కాంగ్రెస్ పార్టీకి బాసటగా నిలుస్తుందన్నారు. తెలంగాణ జనసమితి ముషీరాబాద్ ఇన్‌చార్జి ఎం.నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు.



ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్



ఫ్రెండ్స్ కాలనీలో మహిళను ఓటు అడుగుతున్న అంజన్‌కుమార్‌యాదవ్



ముషీరాబాద్‌లో..

## బీఆర్ఎస్ వైపే యువత చూపు

- ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్
- హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో యువ సమ్మేళనం
- భారీగా హాజరైన యువత

**ముషీరాబాద్:** ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని బీఆర్ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గ ముఠా జైసింహ యువ సేన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యువ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సభకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వల్లాల శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ యువత ఉజ్వల భవిష్యత్‌కు ప్రభుత్వం అనేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. ముఠా జైసింహ మాట్లాడుతూ మతతత్వ పార్టీ బీజేపీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులను చిత్తుగా ఓడించాలన్నారు. యువ సేన నాయకులు ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన లబ్ధిదారులను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి ముఠా గోపాల్‌ను రెండవసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తలసాని సాయికిరణ్‌యాదవ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్య ఉండే ముఠా గోపాల్ రెండవ సారి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు వి.శ్రీనివాస్‌రెడ్డి, ముఠా పద్మ, అనిల్‌కురుమ చలం, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, శశాంక్, దినేష్‌చౌదరి, ఎక్కాల కన్నా, రోషంబాబు, ముఠా శివసింహ పాల్గొన్నారు.



సమ్మేళనానికి హాజరైన యువకులు

**దళితుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట...**

రాష్ట్ర వ్యాప్తంగా దళితుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని బీఆర్ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయంలో ముషీరాబాద్ నియోజకవర్గం దళిత సంఘం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తూ నిర్వహించిన సమావేశానికి భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిధిగా హాజరైన ముఠా గోపాల్ మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా బలపడే విధంగా దళిత బంధు పథకం పేరిట 10 లక్షల రూపాయల ఆర్థిక రుణాలను అందజేశామని పేర్కొన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో దళితులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్‌ను వై.శ్రీనివాస్ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, సిరిగిరి శ్యామ్, వివేక్, కల్వగోపి, శ్యామ్ సుందర్, జి.వై.గిరి, సాయి, సదా పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న ముఠా జైసింహ, వి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు




మాట్లాడుతున్న ముఠా గోపాల్

**ముదిరాజ్ సంఘం మద్దతు...**

ముషీరాబాద్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లో అందారా ఫంక్షన్‌హాల్‌లో శనివారం ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లు ఐక్యంగా బీఆర్ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

## బీజేపీతోనే సమగ్రాభివృద్ధి

- ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూసరాజు
- సుందరయ్య పార్కులో ఎన్నికల ప్రచారం

**ముషీరాబాద్:** ముషీరాబాద్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పూస రాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ గుండు, లలితానగర్, బాలాజీ నగర్, గణేష్‌నగర్, లక్ష్మమ్మ పార్కు, రామాలయం వెనకవీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి బీజేపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పూస రాజు మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తిని సీఎంను చేస్తామని ప్రకటించిన ఘనత బీజేపీదేనన్నారు. గత ఐదేళ్లలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్.నరేష్, సాయికృష్ణాయాదవ్, జి.సూర్యనారాయణశర్మ, కౌండిన్యప్రసాద్, సుబ్రమణ్యంబాబు, గౌరీశంకర్, రామారావు, లక్ష్మణ్‌పాల్గొన్నారు.

**బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం**

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, తనకు ఒకసారి అవకాశం ఇస్తే ముషీరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ముషీరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పూస రోజు అన్నారు. శనివారం ఆయన సుందరయ్య పార్కులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివాజీ, జైపాల్‌రెడ్డి, కలకోట అరుణ్, కె.ఉపేందర్, ఉదయ్‌భగవత్ పాల్గొన్నారు.



సుందరయ్య పార్కులో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి పూస రాజు



అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు